ఇంటర్మీడియట్ విద్యార్హతతోనే రక్షణరంగంలో అత్యున్నత హోదాతో లక్షణంగా రాణించవచ్చు. యూపీఎస్సీ నిర్వహించే నేషనల్ డిఫెన్స్ అకాడెమీ అండ్ నేవల్ అకాడెమీ (ఎన్‌డీఏ అండ్ ఎన్‌ఏ).. పరీక్ష, ఇంటర్వ్యూల్లో ప్రతిభతో మెరిసినవారు బీఏ/బీఎస్సీ/బీటెక్ కోర్సులు ఉచితంగా చదువుకోవచ్చు. విద్య, శిక్షణ పూర్తయిన తర్వాత లెవెల్-10 వేతనశ్రేణితో ఆర్మీ/నేవీ/ఎయిర్ ఫోర్స్‌ల్లో సేవలు అందించవచ్చు. మహిళలకూ అవకాశం ఉంది. ఇటీవల వెలువడిన ఎన్‌డీఏ అండ్ ఎన్‌ఎ- 2023(2) పూర్తి వివరాలు..

# చిన్న వయసులోనే అద్భుత కెరియర్!

చిన్న వయసులోనే చక్కని కొలువుకు దారిచూపే మేటి పరీక్ష ఎన్‌డీఏ అండ్ ఎన్‌ఏ. దేశ రక్షణలో భాగస్వాములు కావాలని ఆశించేవారికి ఎన్‌డీఏ అత్యుత్తమ వేదిక. మెరికల్లాంటి యువతను సానబెట్టి, రక్షణ ఉద్యోగాలు అందించే లక్ష్యంతో యూపీఎస్సీ ఏడాదికి రెండుసార్లు ఈ పరీక్షను నిర్వహిస్తోంది. ఇందులో ఎంపికైన వారు పుణెలోని నేషనల్ డిఫెన్స్ అకాడెమీ (ఎన్‌డీఏ)లో బీటెక్, బీఎస్సీ, బీఏ కోర్సులు ఉచితంగా చదువుకుంటూ ప్రాథమిక శిక్షణ పొందవచ్చు. వసతి, భోజనం, బట్టలు...అన్నీ ఎన్‌డీఏ చూసుకుంటుంది.

నేవల్ అకాడెమీ (ఎన్‌ఏ)కు ఎంపికైనవాళ్లు కేరళలోని ఎజిమాళలో బీటెక్ విద్య అభ్యసిస్తారు. ఎన్‌డీఏ, ఎన్‌ఎల్లో విజయవంతంగా చదువు పూర్తిచేసుకున్నవారికి జేఎన్‌యూ, న్యూదిల్లీ పట్టాలను ప్రదానం చేస్తుంది. అనంతరం ట్రేడ్ శిక్షణ సంబంధిత కేంద్రాల్లో అందిస్తారు. ఈ సమయంలో ప్రతినెలా రూ.56,100 స్టైపెండ్ అందుతుంది. దీన్ని పూర్తిచేసుకున్నవారు ఆర్మీలో లెఫ్టినెంట్, నేవీలో సబ్ లెఫ్టినెంట్, ఎయిర్ ఫోర్స్‌లో ఫ్లయింగ్ ఆఫీసర్ (పైలట్)/ గ్రౌండ్ డ్యూటీ ఆఫీసర్ హోదాతో విధులు నిర్వర్తిస్తారు. ఇవన్నీ సమాన స్థాయి ఉద్యోగాలు. అందరూ లెవెల్-10 వేతనాలే అందుకుంటారు. మొదటి నెల నుంచే రూ.లక్షకుపైగా జీతం, పలు ప్రోత్సాహకాలూ అందుకోవచ్చు. విధుల్లో రెండేళ్ల తర్వాత ప్రమోషన్ పొందవచ్చు. ఆరేళ్లకు మరొకటి, పదమూడేళ్లకు మరో ప్రమోషన్ దక్కుతుంది. అనంతరం ప్రతిభ, అనుభవం ప్రాతిపదికన ఉన్నత స్థాయికి చేరుకోవచ్చు. భవిష్యత్తులో ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లకు అత్యున్నత అధికారి, త్రివిధ దళాలకు అధిపతీ కావచ్చు.

### ఎంపిక ఇలా..

పరీక్ష, ఇంటర్వ్యూల్లో చూపిన ప్రతిభతో నియామకాలుంటాయి. పరీక్షలో రెండు పేపర్ల నుంచి 900 మార్కులకు ప్రశ్నలు వస్తాయి. ఒక్కో పేపర్ వ్యవధి రెండున్నర గంటలు. పేపర్-1 మ్యాథ్స్ 300 మార్కులకు ఉంటుంది. మొత్తం 120 ప్రశ్నలు వస్తాయి. ప్రతి ప్రశ్నకు రెండున్నర మార్కులు. పేపర్-2లో జనరల్ ఎబిలిటీ విభాగం నుంచి 150 ప్రశ్నలు 600 మార్కులకు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు 4 మార్కులు. ఇందులో పార్ట్ ఎ ఇంగ్లిష్‌కు 200, పార్ట్ బి జనరల్ నాలెడ్జ్‌కి 400 మార్కులు. ఇంగ్లిష్‌లో 50, జనరల్ నాలెడ్జ్ విభాగంలో.. ఫిజిక్స్ 25, కెమిస్ట్రీ 15, జనరల్ సైన్స్ 10, చరిత్ర, స్వాతంత్ర్యోద్యమాలు 20, భూగోళశాస్త్రం 20, వర్తమానాంశాల నుంచి 10 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు వస్తాయి. తప్పు సమాధానాలకు ఆ ప్రశ్నకు కేటాయించిన మార్కులో మూడో వంతు తగ్గిస్తారు. పరీక్షలో అర్హతకు సబ్జెక్టులవారీ 25 శాతం మార్కులు పొందాలి.

అర్హత మార్కులు పొందినవారి జాబితా నుంచి మెరిట్ ప్రకారం కొంతమందికి సర్వీస్ సెలక్షన్ బోర్డు (ఎస్ఎస్‌బీ) ఆధ్వర్యంలో ఇంటెలిజెన్స్ అండ్ పర్సనాలిటీ టెస్టులు యూపీఎస్సీ నిర్వహిస్తుంది. ఈ విభాగానికి 900 మార్కులు కేటాయించారు. ఇందులో.. గ్రూప్ టెస్టులు, గ్రూప్ డిస్కషన్, గ్రూప్ ప్లానింగ్, అవుట్ డోర్ గ్రూప్ టాస్కుల్లో ప్రతిభ చూపాలి. వీటిని రెండంచెల్లో ఐదు రోజులు నిర్వహిస్తారు. తొలిరోజు పరీక్షల్లో అర్హత సాధించినవారికే మిగిలిన నాలుగు రోజుల టాస్క్, ఇంటర్వ్యూలు కొనసాగుతాయి. రాత పరీక్ష, సర్వీస్ సెలక్షన్ బోర్డు ఇంటర్వ్యూల్లో వచ్చిన మొత్తం మార్కుల మెరిట్‌తో తుది నియామకాలుంటాయి. అవకాశం వచ్చినవారికి జులై 2, 2024 నుంచి శిక్షణ, తరగతులు ప్రారంభమవుతాయి.

### సన్నద్ధత ఎలా?

1 ముందు నోటిఫికేషన్ శ్రద్ధగా చదవాలి. సిలబస్ వివరాలు పరిశీలించాలి. వాటి ప్రకారం సీబీఎస్ఈ 10, 11, 12 తరగతుల పుస్తకాలను బాగా అధ్యయనం చేయాలి.

2 ప్రాథమికాంశాలపై దృష్టి పెట్టాలి. ఇందుకోసం 8,9,10 తరగతుల మ్యాథ్స్, సైన్స్, సోషల్ పాఠ్యపుస్తకాలు చదువుతూ ముఖ్యాంశాలు నోట్సు రాసుకోవాలి.

3 పాత ప్రశ్నపత్రాలు పరిశీలించాలి. వీటిని యూపీఎస్సీ వెబ్‌సైట్ నుంచి పొందవచ్చు. ఏ స్థాయిలో, ఎలాంటి ప్రశ్నలు వస్తున్నాయి, ఏ చాప్టర్లకు ప్రాధాన్యం ఉందో గమనించి పరీక్ష కోణంలో తుది సన్నద్ధత కొనసాగించాలి.

4 వీలైనన్ని మాక్ పరీక్షలు రాయాలి. పరీక్ష పూర్తయిన వెంటనే ఫలితాలు విశ్లేషించుకోవాలి. వాటి ప్రకారం వెనుకబడిన సబ్జెక్టులు/పాఠ్యాంశాలకు ప్రాధాన్యమివ్వాలి. తర్వాత రాసే పరీక్షల్లో తప్పులు పునరావృతం కాకుండా చూసుకుని, ఏవైనా లోపాలు ఉంటే సరిచేసుకోవాలి.

5 ఇబ్బంది పెడుతోన్న అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి.

6 మాథ్స్ ప్రశ్నలకు సమయం సరిపోకపోవచ్చు. వీలైనన్ని మాదిరి ప్రశ్నల సాధనతో వేగం, కచ్చితత్వాన్ని అందుకోవచ్చు.

7 రుణాత్మక మార్కులు ఉన్నందువల్ల అవగాహన లేని ప్రశ్నలను వదిలేయాలి. అలాగే సమాధానం కోసం ఎక్కువ సమయం తీసుకునే ప్రశ్నలను పరీక్ష చివరలోనే ప్రయత్నించాలి.

### సబ్జెక్టులవారీగా...

- గణితంలోని ప్రాథమికాంశాలు, సూత్రాలు, అనువర్తనంపై దృష్టి సారించాలి. ఈ పేపర్‌లో ప్రశ్నలు 8 చాప్టర్ల నుంచి వస్తున్నాయి. పాత ప్రశ్నపత్రాలు గమనించి ఎక్కువ ప్రశ్నలు వస్తోన్న అధ్యాయాలకు అధిక ప్రాధాన్యమివ్వాలి.
- ఫిజిక్స్‌లో కాన్సెప్ట్ ఆధారిత ప్రశ్నలు అడుగుతున్నారు. సూత్రాలు, అనువర్తనంపై అవగాహన పెంచుకోవాలి.
- రసాయనశాస్త్రంలో మూలకాల వర్గీకరణ, సమ్మేళనాలు, మిశ్రమాలపై దృష్టి సారించాలి.
- ఇంగ్లిష్ విభాగంలోని ప్రశ్నలు అభ్యర్థి భాషను ఎలా అర్థం చేసుకుంటున్నారో తెలుసుకునేలా వస్తాయి. వ్యాకరణం, పదసంపదకు ప్రాధాన్యం. వీలైనన్ని కొత్త పదాలను తెలుసుకోవాలి. వాక్యంలోని పదాలు ఒక క్రమంలో అమర్చగలగాలి. అర్థాలు, వ్యతిరేకాలు, తప్పుని గుర్తించడం, జాతీయాలు, సామెతలు, కాంప్రహెన్షన్, ఖాళీని పూరించడం...వీటిలో వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధించాలి.
- కరెంట్ అఫైర్స్ విభాగంలో జనవరి 2023 నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నెలకొన్న కీలక పరిణామాలపై ప్రశ్నలు రావచ్చు. పత్రికలు చదువుతున్నప్పుడే ముఖ్యాంశాలను రాసుకోవాలి.

## మొత్తం ఖాళీలు: 395

వీటిలో నేషనల్ డిఫెన్స్ అకాడెమీలో 370 (ఆర్మీ 208 (10 మహిళలకు), నేవీ 42(12 మహిళలకు), ఎయిర్ ఫోర్స్ మొత్తం 120 ఇందులో 92 ఫ్లైయింగ్ (2 మహిళలకు), గ్రౌండ్ డ్యూటీ టెక్నికల్ 18(2 మహిళలకు), గ్రౌండ్ డ్యూటీ నాన్ టెక్నికల్ 10(2 మహిళలకు)) ఉన్నాయి. నేవల్ అకాడెమీ (10+2 క్యాడెట్ స్కీం)లో 25(7 మహిళలకు) ఖాళీలు ఉన్నాయి.

**అర్హత:** ఆర్మీ వింగ్‌కు ఏదైనా గ్రూపుతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. ఎయిర్ ఫోర్స్, నేవల్ వింగ్స్ (ఎన్‌డీఏ), 10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్ (ఇండియన్ నేవల్ అకాడమీ)లకు ఎంపీసీ గ్రూపుతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. ద్వితీయ సంవత్సరం విద్యార్థులూ అర్హులే.

**వయసు:** జనవరి 2, 2005 - జనవరి 1, 2008 మధ్య జన్మించినవారు అర్హులు. శారీరక ప్రమాణాలు: ఎత్తు కనీసం 157 సెం.మీ. అవసరం. ఎయిర్‌ఫోర్స్‌కు మాత్రం 162.5 సెం.మీ. తప్పనిసరి. ఎత్తుకు తగిన బరువు ఉండాలి.

**ఆన్‌లైన్ దరఖాస్తులు:** జూన్ 6 సాయంత్రం 6 వరకు స్వీకరిస్తారు.

**దరఖాస్తు ఫీజు:** రూ.వంద. మహిళలు, ఎస్సీ, ఎస్టీలకు మినహాయించారు.

**పరీక్ష తేదీ:** సెప్టెంబరు 3

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: అనంతపురం, హైదరాబాద్, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, వరంగల్.

**వెబ్‌సైట్:** https://upsc.gov.in/

### ఉపయోగపడే పుస్తకాలు

- టాటా మెక్ గ్రాహిల్స్, అరిహంత్ పబ్లిషర్ల ఎన్‌డీఏ పుస్తకాలు
- లూసెంట్స్ జనరల్ నాలెడ్జ్ జీకే ప్రశ్నలకు ఉపయోగం
- మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీలకు ఎన్‌సీఈఆర్‌టీ 11, 12 తరగతుల పాఠ్యపుస్తకాలు
- చరిత్ర, భూగోళశాస్త్రం, జనరల్ సైన్స్ విభాగాల్లోని ప్రశ్నలకు ఎన్‌సీఈఆర్‌టీ 8,9,10 తరగతులతోపాటు ప్లస్ 1, 2 పుస్తకాలు

### విజయానికి 40..

పరీక్ష, ఇంటర్వ్యూల్లో 40 శాతం మార్కులతో ఎన్‌డీఏలో అవకాశం పొందవచ్చు. 2022(2) పరీక్షలో 900కు 316 మార్కులు పొందినవారు ఇంటర్వ్యూకు అర్హత సాధించారు. శిక్షణకు అవకాశం వచ్చిన చివరి అభ్యర్థి పొందిన మార్కులు 678. 2022(1) పరీక్షలో 360 మార్కులతో ఇంటర్వ్యూకు, 720 మార్కులు పొందిన వారు ఏదో ఒక విభాగానికి ఎంపికయ్యారు. 2021(2) పరీక్షలో 355 మార్కులతో ఇంటర్వ్యూకు, 726 మార్కులతో ఏదో ఒక సర్వీసుకు అవకాశం వచ్చింది. అంటే పరీక్ష, ఇంటర్వ్యూల్లో 1800కు 40 శాతం (720) మార్కులు పొందినవారు విజయవంతం కావచ్చు.

పరీక్షను ఏటా రెండుసార్లు నిర్వహిస్తున్నారు. తాజాగా ఇంటర్మీడియట్ పూర్తిచేసుకున్నవారు గరిష్ఠ వయఃపరిమితిని పరిగణనలోకి తీసుకుంటే కనీసం ఆరేడుసార్లు ఎన్‌డీఏ అండ్ ఎన్‌ఏ రాసుకోవచ్చు. అందువల్ల దీన్నే లక్ష్యంగా చేసుకుని, శ్రద్ధగా సన్నద్ధమైతే విజయం సాధించడానికి అవకాశం ఎక్కువ. ఎంపీసీ విద్యార్థులకు కొంత అనుకూలం. పేపర్-1లో మ్యాథ్స్ 300, పేపర్ 2లో ఫిజిక్స్, కెమిస్ట్రీ 160 మొత్తం 460 మార్కులకు ఈ గ్రూపు సబ్జెక్టుల నుంచే ప్రశ్నలొస్తాయి. ఇతర గ్రూపుల విద్యార్థులు విజయానికి గట్టి కృషి తప్పనిసరి.

## తాజా ఇంటర్న్‌షిప్‌లు

### డెవోప్స్

**సంస్థ:** ఎడ్యుకేర్‌ఇట్ **ప్రదేశం:** విశాఖపట్నం, హైదరాబాద్, విజయవాడ
**స్టైపెండ్:** నెలకు రూ.2,000
**దరఖాస్తు గడువు:** మే 25
**అర్హతలు:** డాకర్, గిట్‌హబ్, జెన్‌కిన్స్, క్యూబర్‌నేట్స్, టెర్రాఫార్మ్ నైపుణ్యాలు
☛ internshala.com/i/ae461c

### వీడియో మేకింగ్/ఎడిటింగ్

**సంస్థ:** స్టూడియో 18 న్యూస్
**ప్రదేశం:** హైదరాబాద్, విశాఖపట్నం
**స్టైపెండ్:** నెలకు రూ.10,000
**దరఖాస్తు గడువు:** మే 26
**అర్హతలు:** అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, ఫొటోషాప్, ప్రీమియర్ ప్రో, వీడియో ఎడిటింగ్ నైపుణ్యాలు
☛ internshala.com/i/8cb9c8

### బిజినెస్ డెవలప్‌మెంట్

**సంస్థ:** ట్రయోజ్ బయోసైన్సెస్
**ప్రదేశం:** విశాఖపట్నం
**స్టైపెండ్:** నెలకు రూ.10,000-15,000
**దరఖాస్తు గడువు:** మే 26
**అర్హతలు:** బిజినెస్ రిసెర్చ్, రిసెర్చ్ అండ్ అనలిటిక్స్, సేల్స్, సేల్స్ అండ్ మార్కెటింగ్
☛ internshala.com/i/a12406

### వర్క్ ఫ్రమ్ హోమ్

### టెలికాలింగ్

**సంస్థ:** నేవిగేట్ 2 ఎడ్యుకేట్ **స్టైపెండ్:** నెలకు రూ.7,000 **దరఖాస్తు గడువు:** జూన్ 2 **అర్హతలు:** ఇంగ్లిష్, ఎంఎస్-ఎక్సెల్
☛ internshala.com/i/42822c

# ఎన్‌ఎల్‌సీలో 103 ఉద్యోగాలు

**నర్సులు, పారామెడికల్ సిబ్బంది పోస్టుల భర్తీకి నవరత్న సంస్థ నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ (ఎన్‌ఎల్‌సీ) ఇండియా లిమిటెడ్ ప్రకటన విడుదల చేసింది. ఎంపికైనవారిని తమిళనాడులోని నైవేలిలో ఉన్న 350 పడకల జనరల్ హాస్పిటల్‌లో నియమిస్తారు. అభ్యర్థులను ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్ కింద మూడేళ్ల కాలానికి విధుల్లోకి తీసుకుంటారు.**

ప్రకటించిన 103 ఖాళీల్లో మేల్ నర్సింగ్ అసిస్టెంట్, ఫిమేల్ నర్సింగ్ అసిస్టెంట్, మెటర్నిటీ అసిస్టెంట్, రేడియోగ్రాఫర్, ల్యాబ్ టెక్నీషియన్, ఫిజియోథెరపిస్ట్ మొదలైనవి ఉన్నాయి. పోస్టులను అనుసరించి అర్హతల్లో తేడాలు ఉంటాయి.

**1. మేల్ నర్సింగ్ అసిస్టెంట్:** 36 పోస్టులు. పదో తరగతి లేదా సైన్స్ సబ్జెక్టులతో ఇంటర్మీడియట్ పాసవ్వాలి. నర్సింగ్ అసిస్టెంట్/ మల్టీపర్పస్ హాస్పిటల్ వర్కర్‌గా ఏడాది వ్యవధి ఉన్న పారామెడికల్ సర్టిఫికెట్ కోర్సు పూర్తిచేయాలి.

**2. ఫిమేల్ నర్సింగ్ అసిస్టెంట్:** 22 పోస్టులు. మేల్ నర్సింగ్ అసిస్టెంట్ పోస్టుకు ఉన్న అర్హతలే వర్తిస్తాయి.

**3. మెటర్నిటీ అసిస్టెంట్:** 5 పోస్టులు. ఇంటర్మీడియట్ పాసై రెండేళ్ల ఆగ్జిలరీ నర్స్ మిడ్‌వైఫ్ ట్రెయినింగ్ పూర్తిచేయాలి. లేదా డిప్లొమా ఇన్ జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ చేయాలి. నర్సెస్ అండ్ మిడ్‌వైఫరీ కౌన్సిల్‌లో రిజిస్టరై ఉండాలి.

**4. పంచకర్మ (ఆయుర్వేద) అసిస్టెంట్:** 4 పోస్టులు. ఏడాది/రెండేళ్ల వ్యవధి ఉండే పంచకర్మ థెరపీ కోర్సు పాసవ్వాలి. లేదా రెండేళ్లు అంతకంటే ఎక్కువ వ్యవధి ఉన్న పంచకర్మ థెరపీ డిప్లొమా పాసవ్వాలి.

**5. రేడియోగ్రాఫర్:** 3 పోస్టులు. రేడియోలజీ అండ్ ఇమేజింగ్ సైన్స్ టెక్నాలజీ/ మెడికల్ రేడియోలజీ అండ్ ఇమేజింగ్ టెక్నాలజీ/ రేడియోలజీ అండ్ ఇమేజింగ్ టెక్నాలజీ/ మెడికల్ టెక్నాలజీ (రేడియోలజీ అండ్ అండ్ ఇమేజింగ్)/రేడియోగ్రఫీలో బీఎస్సీ పాసవ్వాలి.

**6. ల్యాబ్ టెక్నీషియన్:** 4 పోస్టులు. బీఎస్సీ ఎంఎల్‌టీ పాసవ్వాలి.

**7. డయాలసిస్ టెక్నీషియన్:** 2 పోస్టులు. డయాలసిస్ టెక్నాలజీ/రీనల్ డయాలసిస్ టెక్నాలజీ/డయాలసిస్ థెరపీ/బి.వొకేషనల్ (రీనల్ డయాలసిస్ టెక్నాలజీ)లో బీఎస్సీ పాసవ్వాలి.

**8. ఎమర్జెన్సీ కేర్ టెక్నీషియన్:** 5 పోస్టులు. ఎమర్జెన్సీ కేర్ టెక్నాలజీ/ ఎమర్జెన్సీ మెడిసిన్ టెక్నాలజీ/ యాక్సిడెంట్ అండ్ ఎమర్జెన్సీ కేర్ టెక్నాలజీ/క్రిటికల్ కేర్ టెక్నాలజీలో బీఎస్సీ పాసవ్వాలి.

**9. ఫిజియోథెరపిస్ట్:** 2 పోస్టులు. బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ (బీపీటీ)/ మాస్టర్ ఆఫ్ ఫిజియోథెరపీ (ఎంపీటీ) పాసవ్వాలి.

**10.నర్సులు:** 20 పోస్టులు. బీఎస్సీ నర్సింగ్/ పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్ అండ్ డీజీఎన్ఎం పాసవ్వాలి. స్టేట్/ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్‌లో రిజిస్టరై ఉండాలి.

ప్రభుత్వ/ప్రైవేటు హాస్పిటళ్లు, ఎన్‌ఎల్‌సీ ఇండియా లిమిటెడ్‌లో పనిచేసి.. పదవీ విరమణ చేసిన నర్సులు, పారామెడికల్ సిబ్బంది కూడా ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులకు ప్రాంతీయ/ స్థానిక భాష తెలిసి ఉండాలి. స్థానిక భాష అయిన తమిళాన్ని పదో తరగతి/ మెట్రిక్యులేషన్‌లో ఒక సబ్జెక్టుగా చదివినట్టుగా సర్టిఫికెట్ సమర్పించాలి. అభ్యర్థుల వయసు 55 ఏళ్లు మించకూడదు. ప్రత్యేక వర్గాలకు చెందిన అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం గరిష్ఠ వయసులో సడలింపు ఉంటుంది.

### ఎంపిక ఎలా?

రాత పరీక్ష ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ప్రశ్నపత్రం 100 మార్కులకు ఉంటుంది. ప్రతి ప్రశ్నకూ ఒక మార్కు చొప్పున కేటాయిస్తారు. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష వ్యవధి 120 నిమిషాలు. ఆబ్జెక్టివ్ విధానంలోని ప్రశ్నలు అభ్యర్థుల సబ్జెక్టు పరిజ్ఞానాన్ని పరీక్షించేలా ఉంటాయి. రాత పరీక్షలో పాసవ్వాలంటే అన్‌రిజర్వుడ్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు 50 శాతం కనీసార్హత మార్కులు సాధించాలి. ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ (ఎన్‌సీఎల్)/పీడబ్ల్యూబీడీ అభ్యర్థులు 40 శాతం మార్కులు సంపాదిస్తే సరిపోతుంది. ప్రాథమిక దశలో ఎంపికైన అభ్యర్థులు ప్రీ ఎంప్లాయ్‌మెంట్ మెడికల్ పరీక్షకు హాజరుకావాలి.

ఎంపికైనవారికి నెల వేతనంతోపాటు ప్రావిడెంట్ ఫండ్/ గ్రాట్యుటీ, వైద్య సదుపాయాలు, లీవ్‌లు, ఆఫీస్ టూర్లకు వెళ్లినప్పుడు టీఏ/డీఏ, బోర్డింగ్ ఛార్జీలు, వసతి సదుపాయం లేదా హెచ్ఆర్ఏ అలవెన్స్ చెల్లిస్తారు.

**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 01.06.2023

- ఒకటికంటే ఎక్కువ పోస్టులకు దరఖాస్తు చేసే అభ్యర్థులు ప్రతి పోస్టుకూ ప్రత్యేకంగా దరఖాస్తు నింపాలి. అవసరమైన సర్టిఫికెట్లనూ వేర్వేరుగా అప్‌లోడ్ చేయాలి. ప్రతి పోస్టుకూ దరఖాస్తు ఫీజు చెల్లించాలి.
- దరఖాస్తు ఫీజు రూ.486.
- ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూబీడీ/ఎక్స్-సర్వీస్‌మెన్ అభ్యర్థులకు దరఖాస్తు ఫీజు లేదు. కానీ వీరు ప్రాసెసింగ్ ఫీజు రూ.236 చెల్లించాలి.

**వెబ్‌సైట్:** www.nlcindia.in

### సన్నద్ధత

రాత పరీక్షలోని ప్రశ్నలు అభ్యర్థుల సబ్జెక్టు పరిజ్ఞానాన్ని పరీక్షించేలా ఉంటాయి. కాబట్టి సిలబస్‌లోని అంశాలపై స్పష్టత ఉండాలి. ముందుగా ప్రాథమికాంశాలపై పట్టు సాధించాలి.

- రుణాత్మక మార్కులు లేవు. కాబట్టి ఏ ప్రశ్ననూ వదలకుండా సమాధానాలు రాయాలి.
- తెలిసిన ప్రశ్నలకు వెంటనే సమాధానాలను గురిస్తే.. తెలియని వాటికి చివరలో కాస్త ఎక్కువ సమయాన్ని కేటాయించొచ్చు.
- ప్రాధాన్యమున్న అంశాలను బాగా చదువుకోవాలి.
- పాత ప్రశ్నపత్రాలను పూర్తిచేయడం వల్ల సన్నద్ధత పైన స్పష్టత వస్తుంది. ఏయే అంశాల్లో మెరుగ్గా ఉన్నారో, వేటిల్లో బలహీనంగా ఉన్నారో సమీక్షించుకునే దాని ప్రకారం చదివితే సమయాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు.

## నోటిఫికేషన్స్

### ఉద్యోగాలు

### 77 టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు

కటక్‌లోని స్వామి వివేకానంద నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిహాబిలిటేషన్ ట్రైనింగ్ అండ్ రిసెర్చ్ కాంట్రాక్ట్ ప్రాతిపదికన 77 టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
**అర్హతలు:** పోస్టును అనుసరించి 10+2, డిప్లొమా, సర్టిఫికెట్, డిగ్రీ, పీజీ, డీఈడీ, బీఈడీ, ఎంఈడీ, పీజీ డిప్లొమా, ఎంఫిల్, పీహెచ్‌డీతో పాటు పని అనుభవం. **ఎంపిక:** రాత పరీక్ష, విద్యార్హతలు, పని అనుభవం ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 07.06.2023. **వెబ్‌సైట్:** https://svnirtar.nic.in/

### నేవీలో 372 చార్జ్‌మ్యాన్ పోస్టులు

ఇండియన్ నేవల్ సివిలియన్ ఎంట్రన్స్ టెస్ట్ ద్వారా 372 చార్జ్‌మ్యాన్ పోస్టుల భర్తీకి భారత నౌకాదళం ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఎంపికైన అభ్యర్థులు హెడ్‌క్వార్టర్స్ వెస్టర్న్ నేవల్ కమాండ్ (ముంబయి), హెడ్‌క్వార్టర్స్ ఈస్టర్న్ నేవల్ కమాండ్ (విశాఖపట్నం), హెడ్‌క్వార్టర్స్ సదరన్ నేవల్ కమాండ్ (కొచ్చి), హెడ్‌క్వార్టర్స్ అండమాన్ అండ్ నికోబార్ కమాండ్ (పోర్ట్ బ్లెయిర్) యూనిట్లలో పని చేయాలి.
**గ్రూప్:** ఎలక్ట్రికల్, వెపన్, ఇంజినీరింగ్, కన్‌స్ట్రక్షన్ అండ్ మెయింటెనెన్స్, ప్రొడక్షన్ ప్లానింగ్ అండ్ కంట్రోల్.
**ట్రేడ్:** ఎలక్ట్రికల్ ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్ ఫిట్టర్, గైరో ఫిట్టర్, రేడియో ఫిట్టర్, రాడార్ ఫిట్టర్, సోనార్ ఫిట్టర్, ఇన్‌స్ట్రుమెంట్ ఫిట్టర్, కంప్యూటర్ ఫిట్టర్, వెపన్ ఫిట్టర్, బాయిలర్ మేకర్, ఇంజిన్ ఫిట్టర్, ఫౌండర్, జీటీ ఫిట్టర్, ఐస్ ఫిట్టర్, పైప్ ఫిట్టర్, మెషినిస్ట్, మెషినరీ కంట్రోల్ ఫిట్టర్, రెఫ్రిజిరేషన్ అండ్ ఏసీ ఫిట్టర్, ప్లేటర్, వెల్డర్, షిప్ రైట్, లాగర్, రిగ్గర్, షిప్ ఫిట్టర్, మిల్ రైట్, ఐస్ ఫిట్టర్ క్రేన్, పెయింటర్, సివిల్ వర్క్స్, పీపీ అండ్ సి.
**అర్హత:** సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ.
**వయసు:** 29-05-2023 నాటికి 18-25 సంవత్సరాల మధ్య ఉండాలి.
**దరఖాస్తు రుసుము:** రూ.278. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు ఫీజు మినహాయింపు ఉంటుంది.
**ఎంపిక:** రాత పరీక్ష, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా. **ఏపీ, టీఎస్‌లో పరీక్ష కేంద్రాలు:** విశాఖపట్నం, హైదరాబాద్.
**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 29-05-2023.
**వెబ్‌సైట్:** https://indiannavy.cbexams.com/

### ప్రవేశాలు

### జవహర్ నవోదయ-IIవ తరగతి లేటరల్ ఎంట్రీ

జవహర్ నవోదయ విద్యాలయ (జేఎన్‌వీ)లో 11వ తరగతి (లేటరల్ ఎంట్రీ)లో ప్రవేశాలకు సంబంధించి కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ దరఖాస్తులు కోరుతోంది.

- జవహర్ నవోదయ విద్యాలయ ఎంపిక పరీక్ష-2023 11వ తరగతి లేటరల్ ఎంట్రీ.

**అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణత.
**వయసు:** 01.06.2006 - 31.05.2008 మధ్య జన్మించి ఉండాలి.
**ఎంపిక విధానం:** పరీక్షలో మెరిట్ ఆధారంగా.

- పరీక్షలో భాగంగా మెంటల్ ఎబిలిటీ, ఇంగ్లిష్, సైన్స్, సోషల్ సైన్సెస్, మ్యాథమెటిక్స్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. పేపర్ ఇంగ్లిష్, హిందీ భాషల్లో ఉంటుంది.

**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 31.05.2023.
**పరీక్ష తేదీ:** 22.07.2023.
**వెబ్‌సైట్:** https://navodaya.gov.in/nvs/en/Home1

### సీపీగెట్ - 2023

తెలంగాణలోని 8 విశ్వవిద్యాలయాల్లో పీజీ, పీజీ డిప్లొమా, ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రన్స్ టెస్ట్ (సీపీగెట్) నోటిఫికేషన్ విడుదలైంది.
అర్హతలు: పీజీ, పీజీడీ కోర్సులకు కనీసం 40% మార్కులతో బ్యాచిలర్స్ డిగ్రీ, బీఎడ్; ఐపీజీ కోర్సులకు కనీసం 50% మార్కులతో 10+2/ ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలి.
**ఎంపిక:** ప్రవేశ పరీక్ష, రిజర్వేషన్ రూల్ ఆధారంగా.
**ప్రవేశ పరీక్ష:** సంబంధిత సబ్జెక్టులో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ ద్వారా.
**రిజిస్ట్రేషన్ ఫీజు:** సింగిల్ సబ్జెక్టుకు ఓసీ/ బీసీ అభ్యర్థులకు రూ.800; ఎస్సీ/ ఎస్టీ/ పీహెచ్ అభ్యర్థులకు రూ.600. అదనపు సబ్జెక్టుకు అన్ని కేటగిరీలకు రూ.450.

- **ఆలస్య రుసుం లేకుండా దరఖాస్తు:** మే 12-జూన్ 11
- **ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షలు:** జూన్ చివరి వారం నుంచి

**వెబ్‌సైట్:** https://cpget.tsche.ac.in/

### వాక్ ఇన్స్

### మేనేజర్, జూనియర్ ఆఫీసర్లు

ఏఐ ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ లిమిటెడ్ ముంబయిలోని చత్రపతి శివాజీ మహారాజ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో 480 పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ